

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 23 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :333 పేజీలు : 4 వెల : రూ 3-00

# సత్ఫలితాలు ఇస్తున్న చేయూత పథకం

**ఆర్థికంగా ఎదురుగుతున్న మహిళలు**

**రెండో ఏడాది వైఎస్సార్ చేయూతలో నగదు జమ**

**వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం జగన్**



అమరావతి,జూన్22(: చేయూత పథకంతో మహిళలు ఆర్థికంగా పురోగమిస్తున్నారని సిఎం జగన్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ పథకంలో లబ్దిపొందని అర్హుఉల మరోమారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 45-60 ఏళ్ల వయసు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 23,14,342 మంది మహిళలకు రూ.4,339.39 కోట్ల ఆర్థిక సాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మట్లాడుతూ.. వైఎస్ఆర్ చేయూత ద్వారా 23.14 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరుతుదని, మహిళల ఖాతాల్లో రూ.4,339.39 కోట్లు జమ చేశామన్నారు. 45-60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 సాయం అందిస్తున్నామని తెలిపారు. నాలుగేళ్లలో రూ.75వేల చొప్పున సాయం చేసే గొప్ప కార్యక్రమమని, ప్రతి కుటుంబానికి మహిళలే రథసారధులని సీఎం జగన్ అన్నారు. వైఎస్ఆర్ చేయూత ద్వారా రెండేళ్లలో రూ.9వేల కోట్ల ఆర్థిక సాయంతో పాటు జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నామని సీఎం జగన్ అన్నారు. ఈ పథకం ద్వారా అందజేసే డబ్బులను ఉపయోగించుకోవడంలో మహిళలకు పూర్తి స్వేచ్ఛనిస్తూనే వారి జీవనోపాధి మార్గాలను మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందజేస్తోంది. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు కిరాణా షాపులతోపాటు గేదెలు, ఆవులు, మేకలు లాంటి జీవనోపాధి మార్గాలను ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు తోడ్పాటు అందజేస్తారు. ఈ వ్యాపారాలలో మహిళలకు ఎక్కువ లాభాలు దక్కేలా అమూల్, హెచ్‌యూఎల్, రిలయెన్స్, పీఅండ్‌జీ, ఐటీసీ లాంటి దిగ్గజ సంస్థలు, బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న విషయం తెలిసిందే. అమూల్, రిలయన్స్, పీ అండ్ జీ, ఐటీసీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని, 78వేల మంది మహిళలు కిరాణా షాపులు పెట్టుకోగలిగారని సీఎం జగన్ తెలిపారు. 45 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున వరుసగా నాలుగేళ్లలో మొత్తం రూ.75,000 ఆర్థిక సాయం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా మహిళలకు దాదాపు రూ.19,000 కోట్లు అందజేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. మొదటి, రెండో విడతలో కలిపి రూ.8,943 కోట్ల మొత్తం మహిళలకు అందజేసినట్లు అయింది. ఇప్పటికే 78వేల మందికి ఏపీ ప్రభుత్వం కిరాణా షాపులు పెట్టించింది. కిరాణా షాపుల ద్వారా ఒక్కో మహిళకు రూ.10వేల వరకు అదనపు ఆదాయం రానుంది. 1,90,517 మందికి ప్రభుత్వం గేదెలు, ఆవులు, మేకలు అందించింది. లీటర్ పాలకు అదనంగా రూ.5 నుంచి రూ.15 వరకు లబ్ది చేకూరుతోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా లబ్దిదారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల కార్యాలయం నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేప్ కేసులో పురోగతి

విజయవాడ, జూన్ 22, (న్యూన్ వల్స్)గుంటూరు జిల్లా యువతి అత్యాచారం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఘటనకు సంబంధించి అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారని హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత తెలిపారు. ఇప్పటికే పోలీసులు చాలా మందిని విచారించారని, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. బాధితురాలి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేస్తామని, దర్యాప్తు అనంతరం నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామని ఆమె పేర్కొన్నారు. కాగా గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్ మండలం సీతానగరం పుష్కర ఘాట్ సమీపంలో శనివారం నర్సింగ్ విద్యార్థినిపై అత్యాచారం జరిగిన విషయం విదితమే. గొంతు విన్నా గుర్తు పడతానని బాధితురాలు చెబుతుండటంతో అనుమానితుల వాయిస్ బాధితురాలికి వినిపించి నిందితులను నిర్ధారణ చేసుకోవాల్సి ఉందని మంత్రి సుచరిత అన్నారు. ప్రతిపక్షాలు ఇప్పటివరకు నిందితులను పట్టుకోలేదని కామెంట్ చేస్తున్నాయని, తమ ప్రభుత్వం నిజమైన నిందితుల్ని పట్టుకొని కఠిన శిక్ష పడేలా చూస్తుందని స్పష్టం చేశారు. ఎవరిని పడితే



వారిని అమాయకుల్ని కేసులో ఇరికించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని అన్నారు. మహిళల భద్రతపై ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని పేర్కొన్నారు. ఇక ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. అత్యాచార ఘటన తన మనసును కలచివేసిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో ఎక్కడా జరగకూడదన్నారు. డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంప్ కార్యాలయానికి పిలిపించుకుని ఘటనపై ఆరా తీశారు. నిందితులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకూడదని.. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితురాలిని పరామర్శించి ప్రభుత్వం తరఫున భరోసా ఇవ్వాలని రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచరితను, స్త్రీ శిశు సంక్షేమ శాఖ తానేటి వనితను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు బాధితురాలికి ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయల పరిహారం అందజేస్తున్నట్లు ఏపీ మంత్రులు సుచరిత, తానేటి వనిత ప్రకటించారు.

# వంశధార ట్రిబ్యునల్ తీర్పు సంతోషకరం: సీఎం జగన్



అమరావతి: వంశధార జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు సంతోషకరమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ట్రిబ్యునల్ నిర్ణయం ఏపీ, ఒడిశాకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గెజిట్ విడుదలైన తర్వాత వంశధారపై నేరడి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. నేరడి బ్యారేజీ శంకుస్థాపనకు ఒడిశా ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామని సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు.కాగా వంశధార నదీ జలాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదానికి ముగింపు పలుకుతూ ఇచ్చిన తుది తీర్పునే వీడబ్ల్యూడీటీ (వంశధార జల వివాదాల ట్రిబ్యునల్) ఖరారు చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 13, 2017న ఇచ్చిన తుది తీర్పుపై అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం?1956 సెక్షన్?5(3) కింద ఒడిశా సర్కార్ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఈ మేరకు సోమవారం వీడబ్ల్యూడీటీ చైర్మన్ జస్టిస్ డాక్టర్ ముకుందకం శర్మ ఉత్తర్వులు జారీ చేస్తూ కేంద్రానికి నివేదించారు.వంశధార ట్రిబ్యునల్ తుది తీర్పును నోటిఫై చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తే.. ఆ తీర్పు అమల్లోకి వస్తుంది. తుది తీర్పును సవాల్ చేస్తూ ఒడిశా సర్కార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయం ఆధారంగా కేంద్రం ఆ తీర్పును నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

# నారద స్కామ్ కేసు విచారణ నుంచి తప్పుకున్న 'సుప్రీం' జడ్జి

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌కు సంబంధించిన ఒక కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టుకు చెందిన మరొక న్యాయమూర్తి తప్పుకున్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రమేయం ఉన్నట్టు చెబుతున్న నారద ముడుపుల కేసు (నారద స్కామ్) విచారణ నుంచి జస్టిస్ అనిరుద్ధ బోస్ మంగళవారంనాడు తప్పుకున్నారు. ఆయన కోల్‌కతాకు చెందిన వారు. "ఈ కేసు వినాలని అనుకోవడం లేదు"అని ఆయన పేర్కొన్నారు. దీంతో జడ్జి హేమంత్ గుప్తా ఈ కేసును మరో బెంచ్‌కు పోస్ట్ చేయాలని రిజిస్ట్రీని కోరారు. జస్టిస్



వినీత్ శరణ్ సారథ్యంలోని బెంచ్ ముందుకు ఈ కేసు ప్రస్తుతం విచారణకు రానుంది.దీనికి ముందు, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కొన్ని ప్రాంతాల్లో చెలరేగిన హింసకు సంబంధించిన కేసులో విచారణ నుంచి కోల్‌కతాకే చెందిన జస్టిస్ ఇందిర బెనర్జీ తప్పుకున్నారు. నారద స్కామ్‌లో తమ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడానికి కోల్‌కతా హైకోర్టు నిరాకరించడాన్ని మమతా బెనర్జీ, న్యాయశాఖ మంత్రి మొలాయ్ ఘటక్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడికి అవకాశం ఉన్నందున నారద కేసు విచారణను బెంగాల్‌లో కాకుండా వేరే చోటకు షిఫ్ట్ చేయాలని సీబీఐ విజ్ఞప్తి చేసింది. దీనిపై సీఎం, న్యాయశాఖ మంత్రి తమ వాదన వినిపించేందుకు అఫిడవిట్లు సమర్పిస్తామని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే, అఫిడవిట్లు సమర్పించకుంటే వచ్చే చిక్కులు సకాలంలో గుర్తించకుండా, ఇప్పుడు తమ ఇష్టానుసారం అవిధవిట్లు సమర్పిస్తామంటే అనుమతించేది లేదని హైకోర్టు స్పష్టం చేసింది. దీనిని మమత, ఘటక్‌లు సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

# మాలో మాకు విద్వేషాలు నింపొద్దు బాబు: ఏపీ మంత్రి



తాడేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కులాలను వాడుకుని రాజకీయం చేస్తున్నారని ఏపీ గృహ నిర్మాణశాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. ఈ మేరకు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి మాట్లాడుతూ.. క్షత్రియుల పేరుతో చంద్రబాబు మాన్సాస్ ట్రస్ట్‌పై యాడ్ ఇప్పించారని మండిపడ్డారు. ఏ వ్యక్తి పేరు లేకుండా క్షత్రియులు అని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. క్షత్రియులు అన్ని పార్టీల్లో ఉన్నారని, ఈ రోజు తమ కమ్యూనిటీని వాడుకుని బాబు రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. రెడ్డి కమ్యూనిటీని రఘురామకృష్ణంరాజుతో చంద్రబాబుతిట్టిస్తున్నాడని మంత్రి మండిపడ్డారు. ట్రస్టుల్లో లోపాలు ఉంటే ప్రభుత్వం సరిచేస్తుందని, ఇటువంటి పరిస్థితిలో చంద్రబాబు చిల్లర రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. మాలో మాకు విద్వేషాలు నింపొద్దని చంద్రబాబుకి సూచించారు. అసలు ఊరు పేరు లేకుండా ప్రకటన ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తమ కమ్యూనిటీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

# కొత్తగా 4,169 కొవిడ్ కేసులు

**బులెటిన్ విడుదల చేసిన వైద్యారోగ్య శాఖ**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా 74,453 పరీక్షలు నిర్వహించగా.. 4,169 కేసులు నిర్ధారణ అయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 18,57,352 మంది వైరస్ బారినపడినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొవిడ్ వల్ల 53 మంది బాధితులు




ప్రాణాలు కోల్పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య 12,416కి చేరింది. 24 గంటల వ్యవధిలో 8,376 మంది బాధితులు కోలుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య 17,91,056కి చేరినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 53,880 యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,12,80,302 నమూనాలను ఆరోగ్య శాఖ పరీక్షించింది. అత్యధికంగా చిత్తూరులో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

# వైఎస్ జగన్ ప్రభుత్వంపై చిరంజీవి ప్రశంసల జల్లు

**చిరంజీవి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**



ఆంధ్రప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో వ్యాక్సినేషన్ చేపట్టడం పట్ల మెగాస్టార్ చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఒకే రోజు 13.72 లక్షల మందికి వ్యాక్సిన్ వేయించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురిపించారు. కోవిడ్ మహమ్మారి కట్టడి కోసం ఏపీ వైద్య ఆరోగ్య శాఖ చేస్తున్న ప్రయత్నాన్ని సోషల్ మీడియా వేదికగా అభినందించారు. కోవిడ్ నియంత్రణ కోసం ఏపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు.

ఆదర్శవంతమైన పరిపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. కాగా, కోవిడ్ నియంత్రణ చర్యల్లో భాగంగా ఏపీ ప్రభుత్వం ఆదివారం ఒక్కరోజే 13 లక్షల మందికి పైగా వ్యాక్సిన్ అందించారు. వాస్తవానికి ఒక్క రోజు 8 లక్షల మంది వ్యాక్సిన్ వేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దాన్ని అధిగమిస్తూ.. ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 13.72 లక్షల మందికి వ్యాక్సిన్ వేశారు.

# జూన్ 29న ఆందోళన కార్యక్రమాలు: చంద్రబాబు

హైదరాబాద్: సంక్షేమం పేరుతో ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలను మోసగిస్తున్నారని... ప్రజలకు జగన్ సర్కారు ఇచ్చింది గోరంత... దోచింది కొండంత అని టీడీపి ఆధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. మంగళవారం నాడు నియోజకవర్గ ఇంఛార్జిలు, ముఖ్య నేతలతో జరిగిన సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి అవినీతిపై క్షేత్రస్థాయిలో పోరాటాలు చేస్తామన్నారు. ఈ నెల 29వ తేదీన 175 నియోజకవర్గాల్లో టీడీపీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కరోనా నియంత్రణ, వ్యాక్సినేషన్‌లో ఏపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్న చంద్రబాబు.... వారం రోజులు టీకాలు వేయకుండా ఒక్కరోజు మాత్రమే టీకాలు వేసి ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఏపీలో కరోనా మరణాలు ప్రభుత్వ లెక్కలకంటే 14 రెట్లు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని అన్నారు. జాబ్ కేలండర్ పై నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్న టీడీపీ అధినేత ఉద్యోగ, ఉపాధి కల్పనలో రాష్ట్ర పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక వ్యవసాయం పరిస్థితి చూస్తే రైతులకు ఏపీ సర్కారు ధాన్యం బకాయిలు చెల్లించలేదని, పంటలకు గిట్టుబాటు ధర లేదని చంద్రబాబు మండిపడ్డారు. తమిళనాడులో సమర్థులైన, నోబుల్ గ్రహీతలైన వారిని సలహాదారులుగా పెట్టుకుంటే... ఏపీలో మాత్రం అసమర్థులను సలహాదారులుగా పెట్టుకున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ఎక్కడ చూసినా రేప్‌లు, సెటిల్మెంట్లు, ఫ్యాక్షన్ హత్యలు, గంజాయి స్మగ్లింగ్ రాజ్యమేలుతున్నాయన్నారు.

# సంపాదకీయం

**బుధవారం 23 జూన్ 2021**

## కరేబియన్ దీవులు.... ఆర్థిక నేరస్తులకుస్వర్గ ధామాలు

కరేబియన్ దీవులు గురించి భారతీయులకు తెలిసింది తక్కువే. కానీ భారత పారిశ్రామిక వేత్తలకు ఆ దేశాల గురించి చాలా లోతుగా తెలుసు. అవి వారిపాలిట స్వర్గధామల్లాంటివి. భారతదేశంలోని రుణ ఎగవేతదారులకు అవి అత్యంత సురక్షిత ప్రదేశాలు. అంతర్జాతీయ చట్టాలు వారిని ఏమీ చేయలేవు. సొంత దేశాలలో ఎన్ని కేసులున్నప్పటికీ వారిపై ఈగ వాలదు. దర్జాగా, దిలాసాగా బతకవచ్చు. ఎనిమిదో దశకంలో సెయింట్స్ కుంభకోణం ద్వారా భారతీయులకు కరేబియన్ దీవుల గురించి కొంతవరకు పరిచయం. 1989లో నాటి ప్రధాని విశ్వనాథ్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఈ కుంభకోణం వెలుగుచూసింది. అంతకుముందు వెస్టిండీస్ క్రికెట్ జట్టు ద్వారా కరేబియన్ దీవుల గురించి కొంతవరకు తెలుసు. ఈ జట్టు అద్భుతమైన ప్రదర్శన ద్వారా అంతర్జాతీయ మన్ననలు అందుకుంది. ఈ దేశానికి చెందిన దిగ్గజ ఆటగాళ్లు వివియన్ రిచరడ్స్ , గర్డర్ గ్రినిడ్జ్ , డెస్మెండ్ హేన్స్, మాల్కం మార్షల్, రిచీ రిచర్డ్ తమ ప్రతిభా పాటవాలతో గుర్తింపు పొందారు. తాజాగా వివిధ దేశాల్లోని పన్ను ఎగవేతదారులకు ఆశ్రయం కల్పించడం ద్వారా కరేబియన్ దీవులు వార్తల్లోకి ఎక్కాయి.ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సుమారు రూ.13,500 కోట్ల వరకు ఎగ్గొట్టిన మెహుల్ చోక్సీని నిర్బంధంలోకి తీసుకునేందుకు దేశంలోనిదర్యాప్తు సంస్థలు శ్రమిస్తున్నాయి. కోర్టులు, వారంట్ల పేరుతో అవి తిరుగుతున్నాయి. కానీ చోక్సీ మాత్రం కరేబియన్ దేశమైన ఆంటిగ్వాలో విలాసవంతమైన జీవనం గడుపుతూ ఒక్కసారిగా కనపడకుండా పోయాడు. తరవాత క్యూబా వెళుతూ మార్గమధ్యంలో డొమినికా సముద్రతీరాన తచ్చాడుతుండగా పోలీసులుకు చిక్కాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కుంభకోణానికి సంబంధించి దేశం నుంచి తప్పించుకుపోయిన లలిత్ మోదీ అక్కడ చీకూచింత లేని జీవనం గడుపుతున్నాడు. చోక్సీ, మోదీ ఎక్కడున్నారో తెలిసినప్పటికీ వారిని పట్టుకోవడం భారతీయ చట్టాలకు సాధ్యపడటం లేదు. భవిష్యత్తులో అయినావారిని చట్టం ముందు నిలబెట్టడం సాధ్యమా అన్న ప్రశ్నకు సరైన సమాధానం దొరకదు. ఈ పరిస్థితికి కారణాలను విశ్లేషించినప్పుడు ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. కరేబియన్ దీవులలోని ఆంటిగ్వా, బార్బుడోస్, డొమినికా, సెయింట్ కిట్స్ సెయింట్ లూసియా, గ్రెనెడా తదితర దేశాల చట్టాలు నేరగాళ్లకు ఆశ్రయం కల్పించే విధంగా ఉన్నాయి. పౌరసత్వం కావాలనుకునే విదేశీయులకు ఇవి స్వాగతం పలుకుతాయి. పన్ను మినహాయింపులు ఇస్తాయి. వీసా లేకుండా విదేశీ ప్రయాణాలు చేయవచ్చు. రాజ్యాంగపరమైన రక్షణలు కల్పిస్తాయి. ఇతర దేశాల చట్టాలు ఇక్కడ వర్తించవు. దీంతో ఈ దేశాలు నేరగాళ్ల అడ్డాలుగా మారాయి. 1983లో బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన సెయింట్ కిట్స్ పెయిడ్ పౌరసత్వ విధానాన్ని ప్రారంభించింది. ఈ దేశ పౌరసత్వం పొందినవారు వీసా లేకుండా 26 దేశాల్లో ప్రయాణించే వీలుంది.డొమినికా దేశంలో 1.75 లక్షల డాలర్లు పెట్టబడి పెడితే భార్యాభర్తలకు పౌరసత్వం పొందవచ్చు. లూసియానా దేశంలో 1.65 లక్షల డాలర్లు పెట్టుబడి పెడితే దంపతులకు పౌరసత్వం లభిస్తుంది. గ్రెనెడాలో 2 లక్షల డాలర్లు పెట్టుబడి పెడితే చాలా తేలిగ్గా పౌరసత్వం లభిస్తుంది. దీంతో ఈ దేశాలు ఆర్థిక నేరగాళ్ల అడ్డాగా మారుతున్నాయి. ఆంటిగ్వాలో పౌరసత్వం కోసం 2014 నుంచి 28 మంది భారతీయులు దరఖాస్తు చేసుకున్నారు. 2017 జనవరి నుంచి జూన్ వరకు రెండు లక్షల డాలర్లు పెట్టబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చిన ఏడుగురికి పౌరసత్వం లభించింది. ద్వితీయ పౌరసత్వాలను ప్రోత్సహించేందుకు ఆంటిగ్వా ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయడం విశేషం. నిబంధనల మేరకు పౌరసత్వాలను ఇవ్వడంలో తప్పేమీ లేదు. కానీ ఆర్థిక నేరగాళ్లకు, రుణ ఎగవేతదారులకు పౌరసత్వం పేరుతో ఆశ్రయం కల్పించడం ద్వారా ఆయా దేశాలు చెడ్డపేరును మూటగట్టుకుంటాయి. పౌరసత్వం ఇచ్చినప్పటికీ చట్ట ప్రకారం నిందితులు తమ తమ దేశాల్లో చేసిన చట్టవిరుద్ధమైన పనులకు బాధ్యత వహించాలన్న నిబంధన విధించాలి. లేనట్లయితే కరేబియన్ దేశాలు ఏదో ఒకరోజు అంతర్జాతీయ సమాజానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

# మళ్లీ జలజగడం

కర్నూలు, జూన్ 22, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో మిత్రులు అంటూ ఎవరూ ఉండరు, కానీ కొందరు మాత్రం తెర వెనక మిత్రుత్వం బాగానే నెరపుతారు. మొదట్లో నువ్వా నేనా అన్నట్లుగా తలపడినా కూడా విభజనకు ముందే కేసీఆర్, జగన్ కలసిపోయారు అని అప్పట్లోనే ప్రచారం జరిగింది. ఏపీకి జగన్ సీఎం, తెలంగాణాకు కేసీఆర్ అని ఇటీవల మరణించిన నాయని నరసింహారెడ్డి ఆనాడే జోస్యం చెప్పారు. ఆ కల 2019 ఎన్నికల వేళ సాకారం అయింది. ఇక ఇద్దరు మిత్రులు రెండు తెలుగు రాష్ట్రాలను ప్రగతి వైపుగా పరుగులు పెట్టిస్తారు అని అంతా భావించారు. మొదట్లో కూడా అలాగే కథ నడచింది.ఇక జగన్ రాయుంలసీమకు చెందిన వారు, కేసీఆర్ తెలంగాణావాదంతో ఏకంగా రాష్ట్రాన్ని సాధించి పెట్టారు. ఇద్దరికీ ప్రాంతీయ మమకారం మెండు. ఆ విషయంలో అసలు రాజీపడే ప్రసక్తే లేదు. ఇక జగన్ ప్రభుత్వం తాగు, సాగు నీటి కోసం రాయలసీమ ఎత్తిపోతల పథకం రాజోలిబండ (ఆర్డీఎస్) కుడికాల్వ నిర్మాణాలను చేపట్టింది. అయితే ఇవన్నీ కృష్ణా నదికి వరదల కారణంగా వచ్చిన నీరు సముద్రంలోకి పోకుండా మళ్లింపు చేసుకోవడానికే. ఇందులో తెలంగాణాకు ఏ విధమైన నష్టం ఉండదు అని ఏపీ సర్కార్ అంటోంది. కానీ తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేసీఆర్ ఈ నీటి పథకాల మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చట్టాలను గౌరవించని జగన్ ని అడ్డుకుంటామని కూడా గర్జించారు.ఇపుడు కేసీఆర్ దీని మీద కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదులు చేస్తూనే వేరే రూట్లో కూడా రావాలని నిర్ణయించడమే ఇక్కడ చర్చగా ఉంది. అంటే అనుమతులు లేకుండా దాదాపుగా ఎనిమిది దాకా నీటి ప్రాజెక్టులు నిర్మించాలని కేసీఆర్ కచ్చితమైన నిర్ణయాన్నే తీసుకున్నారని అంటున్నారు. జోగులాంబ బ్యారేజీ పేరిట గద్వాల వనపర్తి జిల్లాల మధ్య అలంపూర్ వద్ద కృష్ణ నదిపై ఓ బ్యారేజీని నిర్మించాలని కూడా కేసీఆర్ సర్కార్ నిర్ణయించింది. ఇక్కడి నుంచి 60-70 టీఎంసీల వరద నీటిని తమ ప్రాంతాలకు వివిధ ప్రాజెక్టుల ద్వారా తీసుకుపోవాలని ప్రతిపాదిస్తున్నారు. మరి అదే జరిగితే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి వరదనీళ్ళు రాక ఎండాల్సిందే అంటున్నారు.రెండు రాష్ట్రాల మధ్య విభజన ఆస్తుల పంచాయతీ ఇంకా తెగలేదు. కోట్లగా విలువ చేసే ఆస్తులు ఏపీకి బదలాయింపు కావాల్సి ఉంది. దీని మీద ఇంతవరకూ కేసీఆర్ సర్కార్ ని జగన్ గట్టిగా అడిగింది లేదు. మరో వైపు చూస్తే రాయలసీమ నుంచి వచ్చిన జగన్ మంచి ఉద్దేశ్యంతోనే కృష్ణా నది వరద నీటిని ఉపయోగించుకోవాలని చూస్తే అది ఎగువ రాష్ట్రమైన తెలంగాణాకు కంటగింపుగా మారుతోంది. అనుకున్నట్లుగా వరదనీటికి గండి కొట్టేలా కేసీఆర్ సర్కార్ ప్రాజెక్టులు నిర్మిస్తే సీమకు దారుణంగా అన్యాయం జరుగుతుంది. ఇప్పటికైనా కేసీఆర్ తో జగన్ చర్చలు జరపాలని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి లాంటి వారు కోరుతున్నారు. సమరమో, సామరస్యమో జగన్ తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఏపీలోని రాజకీయ పక్షాలు అంటున్నాయి.

# అక్కా చెల్లెమ్మలకు వైయస్సార్ జగన్ అన్న ఆసరా

### వైఎస్సార్ చేయూత రెండో విడత ప్రారంభించిన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరు మహిళ సాధికారతకు వైఎస్సార్ చేయూత పథకం ఎంతో తోడ్పడుతుందని, అక్కచెల్లెమ్మలకు ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత పథకం రెండో విడత కార్యక్రమాన్ని తన నివాసంలో ని ప్రారంభించారు. లబ్ధిదారులకు అర్హత పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో మహిళ కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు "వైఎస్సార్ చేయూత" పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న మాటకు కట్టుబడి నెరవేర్చడం జగన్మోహన్ రెడ్డి తత్వమన్నారు. రెండేళ్ల లో 90 శాతం హామీలను నెరవేర్చడం దీనికి నిదర్శనమని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండవ ఏడాది 23,14,342 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 4,339.39 కోట్ల ఆర్థిక సాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. అందులో భాగంగా ఎమ్మిగనూరు పట్టణం నందలి ఈ పథకం ద్వారా 4064 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 7,62,000.00 కోట్లు, ఒక్కొక్కరికి రూ. 18,750 లు జమ అయిన ఈ డబ్బును అక్కాచెల్లెమ్మలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గత పాలకులతోనే నీటి సమస్యలు

### మంత్రి ధర్మాన

శ్రీకాకుళం వంశధార ప్రాజెక్టుకు ఆయువుపట్టు అయిన నేరడి బ్యారేజీ నిర్మాణానికి వంశధార ట్రిబ్యునల్ సానుకూలంగా తీర్పును వెల్లడించడంపై ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ హర్షం వ్యక్తం చేశారు. నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చినా గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సమస్య జఠిలమైందని విమర్శించారు. ఏప్రిల్ 16వ తేదీన ఈ విషయమై ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లేఖ రాసి సమస్య పరిష్కారానికి ఎప్పుడు ఆహ్వానిస్తే అప్పుడు వచ్చి మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారని గుర్తుచేశారు.శ్రీకాకుళం లో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సాగునీటి అవసరాల కోసం వంశధార ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతోందని, ఈ దశలో కేవలం 106 ఎకరాల తమ భూమి ముంపునకు గురవుతోందని ఒడిశా అభ్యంతరం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. ఏపి ప్రభుత్వం సదరు భూసేకరణకు అవసరమైన మొత్తాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. వంశధార నదికి ఎడమవైపున ఒడిశా భూభాగంలో బ్యారేజీకి స్లూయిస్ నిర్మించాలన్న ట్రిబ్యునల్ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తామని తెలిపారు. ట్రిబ్యునల్ సూచించిన విధంగా ఎనిమిది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడి స్లూయిస్ నిర్మాణాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసి కీ.శే వైఎస్ రాజశేఖర్రెడ్డి కలలు గన్న వంశధార ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా రైతాంగానికి అంకితం ఇస్తామని పేర్కొన్నారు.

# కారు ద్విచక్రవాహనం ఢీ

### ముగ్గరికి తీవ్రగాయాలు

### ఇద్దరి పరిస్థితి విషమం

చిత్తూరు చిత్తూరు జిల్లా వి.కోట మండలం జవ్వునిపల్లి క్రాస్ సమీపంలో కర్నాటక నుంచి మద్యం తరలిస్తున్న కారు.. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా మరొక్కరు తీవ్రంగా గాయపడ్డారు.రాత్రి వి.కోట నుండీ వెళ్ళుతున్న కారును ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం అడ్డురాగా దానిని తప్పించేందుకు ప్రయత్నించినా ఫలితం లేక పోగా కారు.. టూవీలర్ లు డీ కొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడ్డ వారిని పరిశీలించ కుండా కారులో ఉన్న మద్యాన్ని పక్కకు పడేసేందుకు అందులోని మహిళ.. డ్రైవర్ ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ యువకులను ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం వీరిని కుప్పం ఆస్పత్రికి తరలిస్తున్నారు. సి ఐ ప్రసాద్ బాబు ఘటనాస్థలానికి చేరుకుని కారు సహా నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు .

# చేయూత పేరుతో బీసీలకు నయవంచన



### ఓట్ల కోసం కల్లబొల్లి హామీలిచ్చి.. అధికారంలోకి రాగానే గొంతు కోశారు

### కొల్లు రవీంద్ర

మచిలీపట్నం చేయూత పేరుతో జగన్ రెడ్డి బీసీ మహిళలను నిలువునా ముంచారు. అధికారం కోసం నాడు అలవికాని హామీలిచ్చి.. అధికారం రాగానే వంచనకు తెరలేపారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 45 ఏళ్లు దాటిన ప్రతి వెనుకబడిన వర్గానికి చెందిన అక్క చెల్లెమ్మకు అండగా ఉంటానన్న జగన్ రెడ్డి.. నమ్మక ద్రోహానికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచారు. జగన్ రెడ్డి హామీ మేరకు ఒక్కో మహిళకు నెలకు రూ.3వేల చొప్పున పెన్షన్ అంటే.. ఏడాదికి రూ.36వేలు అందాలి. పాదయాత్రలో ఇచ్చిన హామీపై మడమ తిప్పి.. రూ.18వేలు ఎగ్గొట్టారు. ఇదేనా వెనుకబడిన వర్గాలపై ఉన్న చిత్తశుద్ధి.? అన్నగా అండగా ఉంటానని చెప్పి.. ఓట్లు వేయించుకుని.. పదవి రాగానే దున్నలా మహిళల్ని కొమ్ములతో కుమ్ముతున్నారు. చేయూత అంటూ హడావుడి చేస్తూ.. మహిళల సంక్షేమంలోనూ చేతివాటం చూపుతున్నారని అన్నారు. వ్యాపారాలు చేసుకోవడానికి అండగా ఉంటానన్న జగన్ రెడ్డి.. అమూల్ కు మాత్రమే పాలు పోయాలి, అల్లానా కంపెనీకి మాత్రమే మాంసం దక్కాలని ఒప్పందం చేసుకోవడం కమిషన్ల కక్కుర్తి కోసం కాదా.? మీ కమిషన్ల కోసం, మీ జేబులు నింపుకోవడం కోసం మహిళలను వంచించడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు.తెలుగుదేశం ప్రభుత్వం.. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం ఒక్కొక్కరికి రూ.2లక్షల వరకు రుణం ఇచ్చి అందులో రూ.లక్ష సబ్సిడీ అందించింది. వ్యాపారానికి అండగా నిలిచింది. స్టార్టప్స్ పెట్టేవారికి భూములు, రాయితీ రుణాలు, పరికరాలు అందించింది. మహిళల్ని ఆర్థికంగా స్వతంత్రుల్ని చేయాలని భావించి డ్వాక్రా గ్రూపుల్ని తీసుకొచ్చింది. కానీ.. జగన్ రెడ్డి రూ.18వేలు ఇచ్చి వ్యాపారాలు చేసుకోండని చెప్పడం సిగ్గుచేటు. మీరిచ్చే సొమ్ముతో ఏ వ్యాపారం చేయవచ్చో చెప్పగలరా జగన్ రెడ్డీ.? ఇకనైనా బడుగు బలహీన వర్గాలను సంక్షేమం పేరుతో వంచించడం మానుకోండి. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మహిళా లోకాన్ని వంచించినందుకు క్షమాపణలు చెప్పండి. లేదంటే.. రేపు ఎన్నికల్లో ప్రతి మహిళా ఓ రుద్రకాళిలా మారి నిన్ను, నీ ప్రభుత్వాన్ని నామరూపాలు లేకుండా చేయడం తథ్యమని గుర్తుంచుకోండని అన్నారు.

## దెందులూరు లో చేయూత చెక్కుల పంపిణీ

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు నియోజకవర్గం శాసనసభ్యుడు కోటార్ అబ్బయ్య చౌదరి క్యాంప్ ఆఫీస్ లో వైయస్సార్ చేయూత పథకం కింద రెండవ విడత ఆర్థికసాయాన్ని అందచేసారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి లాంఛనంగా మహిళలకు కు చెక్కులు అందజేశారు. శాసనసభ్యుడు కోటార్ అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ వైయస్సార్ చేయూత అందుకున్న మహిళలందరూ కూడా చాలా ఆనందంగా ఉన్నారని జగనన్న ప్రభుత్వం లో మహిళలకు పెద్దపీట వేశారని జగనన్న మహిళా పక్షపాతి అని ప్రతిపక్షాలు ఎన్ని అవాకులు పేలినా ఖచ్చితంగా నవరత్నాలు ఇచ్చిన టైం కు అందరు అందజేసి వారి కుటుంబాలలో ఆనందం చూత్తుమని శాసనసభ్యు లు తెలియజేశారు

## అమాత్య పదవి కాపాడుకొనే యత్నాలు

విజయవాడ, జూన్ 22, (న్యూస్ పల్స్)పదవులు దక్కించుకోవడం కనాకష్టంగా ఉన్న వైసీపీలో వాటిని నిలబెట్టుకోవడం అంతే కష్టంగా ఉంది. 2019లో ఏర్పాటైన జగన్ సర్కారులో 24 మంది (సీఎం కాక) మంత్రి పదవులు తెచ్చుకున్నారు. అయితే.. వీరిని రెండున్నరేళ్ల తర్వాత మారుస్తానని.. సీఎం జగన్ ప్రకటించారు. 90 శాతం మంది మంత్రులను మారుస్తానని చెప్పారు. ఇక, ఇప్పటికే రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మరో నాలుగైదు మాసాలే వీరికి ఛాన్స్ ఉంటుంది. దీంతో కొత్తవారు తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. అయితే.. ఇప్పుడున్న మంత్రులు తమ పదవులు వదులుకునేందుకు ఇష్టపడడం లేదు. దీనికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. ఇప్పటి వరకు తాము మంత్రులుగా చలామణి అయినందున.. ఇప్పుడు ఆ పదవులు పోతే ఎలా? అనే బాధ వారిలో కనిపిస్తోంది.మరొకటి.. రెండున్నరేళ్ల కాలంలో వారు తమ తమ నియోజకవర్గాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారు. పైగా మంత్రులుగా కూడా వారు సరైన ముద్ర వేయలేక పోయరు. ఈ నేపథ్యంలో మెజారిటీ మంత్రులు తమ పదవులు వదులుకు నేందుకు సిద్ధంగా లేరు. ఈ రెండేళ్లలో తొలి యేడాది మినహాయిస్తే రెండో యేడాది నుంచీ వీరు చేసేందుకు కూడా ఏం లేకుండా పోయింది. మొత్తం కరోనా కాలాహరణం చేసేసింది. కరోనా దెబ్బతో వీరి శాఖల్లో కాదు కదా ? కనీసం వీరు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో పనులు కూడా ఏ మాత్రం ముందుకు సాగలేదు. రెండున్నరేళ్లు మంత్రిగా ఉండి నియోజకవర్గానికి ఏం చేశామంటే చెప్పుకోవడానికి ఏం లేకుండా పోయింది.అలాగని జగన్‌కు చెప్పి ఒప్పించే సాహసం చేయలేరు. ఈ క్రమంలో వారు సరికొత్త లాజిక్‌ను తెరమీదకి తెచ్చారు. "సార్ మీరు మాకు మంచి అవకాశం ఇచ్చారు. కాదనం. కానీ, మేం బాధ్యతలు చేపట్టిన తర్వాత కరోనా కాలం దాపురించింది. దీంతో ఏడాది కాలం వృథా అయింది. ఇక, స్థానిక ఎన్నికలతో మరో ఆరు మాసాల సమయం వృథా అయింది. ఇప్పుడు కూడా కరోనా వెంటాడుతోంది. దీంతో మమ్మల్ని మేం ప్రూవ్ చేసుకోలేకపోయాం. సో.. మాకు మరో ఏడాదైనా సమయం ఇవ్వండి" అని అభ్యర్థిస్తున్నారట. మరి కొందరు మంత్రుల అభ్యర్థన ప్రస్తుతానికి కీలక సలహాదారుకు చేరిందని తెలిసింది.ఎవరి అభ్యర్థనలు ఎలా ? ఉన్నా జగన్ మాటే ఫైనల్ అవుతుందనడంలో సందేహం లేదు. కేబినెట్లో మళ్లీ మంత్రులుగా కొనసాగాలన్న కోరిక ఉన్న వాళ్లు ఎంత మంది ఉన్నారో ? కేబినెట్లోకి రావాలనుకునే వారి లిస్ట్ అంతకు రెండు, మూడింతలు ఉంది. మరి ఏం జరుగుతుందో ? చూడాలి.

## మంత్రిగారు సైలెంట్ అయ్యారు

తిరుపతి, జూన్ 22, (న్యూస్ పల్స్)వైసీపీలో కీలక మంత్రిగా ఉన్న చిత్తూరు జిల్లాకు చెందిన నారాయణస్వామి అలిగారా ? లేక ఏదైనా అవమానం జరిగిందా ? ఇదీ.. ఇప్పుడు ఆసక్తిగా మారిన చర్చ. కొన్నాళ్లుగా ఆయన అసలు తాడేపల్లి వైపు కన్నెత్తి చూడడం లేదు. పైగా తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలోనూ ఆయన హడావిడి ఎక్కడా కనిపించలేదు. జిల్లాకే చెందిన మంత్రి పెద్దిరెడ్డి, నెల్లూరు జిల్లాకు చెందిన మరో మంత్రి అనిల్ అక్కడ వ్యవహారాలు అన్ని చక్క పెట్టేశారు. ఉప ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ ప్రచారం చేయాలని.. సీఎం జగన్ ఆదేశం చినా.. తొలి రెండు రోజులు వచ్చి.. మమ అనిపించి వెళ్లిపోయారు. అప్పుడు కూడా తనే ఒంటరిగా ప్రచారం చేశారు. కీలకమైన మంత్రి, ఇదే జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోనూ నారాయణస్వామి కలిసి పనిచేయలేదు.నారాయణ స్వామి అసహనానికి కారణం ఏంటి ? ఏం జరిగింది? అనేది చర్చకు దారితీస్తోంది. ప్రస్తుతం ఆయన గురించి.. ఆసక్తి కర సమాచారం ఒకటి వైసీపీలో హల్ చల్ చేస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఆయన దూకుడు చూపించారు. చిత్తూరు జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వైసీపీ మద్దతుదారులు ఎక్కువగా గెలుపు గుర్రం ఎక్కేందుకు ప్రయత్నించారు. అదేవిధంగా తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఆయన కొంత మేరకు కృషి చేశారు. ఇక, ఇక్కడ వచ్చిన ఫలితాలు.. సీఎం జగన్‌కు ఆనందం కలిగించాయి. అయితే.. ఈ క్రెడిట్ లో .. మంత్రి నారాయణస్వామికి ఏమాత్రం ప్రాధాన్యం లభించలేదని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.పైగా.. మొత్తంగా క్రెడిట్ అంతా.. మంత్రి పెద్దిరెడ్డికే దక్కిందని.. సీఎం జగన్ దగ్గర ఆయనకే మంచి మార్కులు లభించాయని.. దీంతో నారాయణ స్వామి ముభావంగా ఉంటున్నారని అనుచరులు పేర్కొంటున్నారు. మరోవైపు.. నగరి వైసీపీ పంచాయతీ విషయం కూడా మంత్రి నారాయణస్వామికి సెగ పెడుతోందని అంటున్నారు. ఇక్కడ నిజానికి ఆయన ప్రభావం తక్కువే ఉన్నా.. పెద్దిరెడ్డితో కలిసి ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రభావం కూడా ఉందనే భావనలో ఎమ్మెల్యే రోజా కామెంట్లు చేశారు.ఇక ఇటీవల మంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉండి కూడా నారాయణస్వామికి సీఎం జగన్ అపాయింట్‌మెంట్ రాని పరిస్థితులు కొన్ని సార్లు తలెత్తాయట. ఈ పరిణామాలపై సీఎం జగన్ కానీ, కీలక సలహాదారులు కానీ, ఆయనతో సంప్రదించలేదు. ఇక, ఎంత చేసినా.. తనకు ఏమాత్రం వాల్యూ ఇవ్వడం లేదని భావిస్తున్నారని.. అందుకే నారాయణస్వామి సైలెంట్ అయ్యారని చెబుతున్నారు.

## 2024 టిక్కెట్ కోసం బుద్దా ఖర్చీఫ్

విజయవాడ, జూన్ 22, (న్యూస్ పల్స్)టీడీపీ ఫైర్ బ్రాండ్ నాయకుడు, విజయవాడ టీడీపీ ఇంచార్జ్, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న బుద్ధా వెంకన్న.. వచ్చే ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. వాస్తవానికి 2019 ఎన్నికల్లోనే ఆయన పోటీ చేయాలని అనుకున్నారు. అయితే.. అప్పట్లో ఎంపీ కేశినేని నాని అడ్డుపడ్డారనే వ్యాఖ్యలు వినిపించాయి. రాజకీయంగా నిత్యం దూకుడుగా ఉండే బుద్దా వెంకన్న పార్టీ అధినేత చంద్రబాబుకు అత్యంత ప్రియమైన నేతల్లో ఒకరుగా కొనసాగుతున్నారు.పార్టీపైనా, పార్టీ అదినేత చంద్రబాబుపైనా ఎవరు విమర్శలు చేసినా.. వెంటనే రియాక్ట్ అయి కౌంటర్లు ఇచ్చే బుద్దా వెంకన్నకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఇటీవల కాలంలో ఆయనను పార్టీలోనూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక రోల్ పోషిస్తున్నారు. రాష్ట్ర సమస్యలపైనా బుద్ధా వెంకన్న స్పందిస్తున్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా బుద్దా వెంకన్న పేరు రాజకీయాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. ఇక, విజయవాడ పశ్చిమనియోజకవర్గం విషయానికి వస్తే.. టీడీపీ కి ఇక్కడ బలమైన నేత లేరు.గత ఎన్నికల్లో వైసీపీ నుంచి వచ్చిన జలీల్ ఖాన్ కుమార్తెకు ఇక్కడ టికెట్ ఇచ్చారు. అయితే.. ఆమె వైసీపీ హవా ముందు నిలవలేక ఓడిపోయారు. తర్వాత పరిణామాల్లో ఆమె విదేశాలకు వెళ్లిపోయారు. అదే సమయంలో జలీల్ ఖాన్ .. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇక్కడ నుంచి పోటీచేసే నేతలు టీడీపీకి లేకుండా పోయారు. అయితే.. ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత ఇక్కడ నుంచి పోటీకి సిద్ధంగా ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఆమె కార్పొరేటర్‌గా ఉన్నారు. అయితే పశ్చిమ నియోజకవర్గంలో కమ్మ సమీకరణలు సెట్ అయ్యేలా లేవు.

# నిధులు ఇస్తేనే గెలుపు

గుంటూరు, జూన్ 22, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి అన్ని సమస్యలతో పాటు ప్రధాన సమస్యను ఎలా అధిగమిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి రప్పించుకోవడం చంద్రబాబుకు ఛాలెంజ్ గా చెప్పాలి. అదే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తనవైపు తిప్పుకోవడం కూడా చంద్రబాబుకు బిగ్ టాస్క్. వీటిని పక్కన పెడితే ప్రధాన సమస్య నిధులు. ఎన్నికల నిధుల సమస్య ను ఈసారి చంద్రబాబు ఎలా అధిగమిస్తారన్నది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉండటం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వడంతో పెద్దగా నిధుల సమస్య రాలేదు. కేవలం ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లోనే గత ఎన్నికల్లో చంద్రబాబు నిధులను అభ్యర్థులకు అందజేశారు. కేంద్రంతో వైరం కారణంగా పార్టీకి నిధుల రాక కూడా తగ్గిపోయింది. కార్పొరేట్ కంపెనీలు, సంప్రదాయంగా పార్టీకి నిధులు ఇస్తున్న వారు కూడా మొహం చాటేశారు. దీంతో వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు నిధుల సమస్య ఇబ్బందిగా మారనుందంటున్నారు. ఈసారి రిజర్వ్ డ్ నియోజకవర్గాలే కాదు జనరల్ నియోజకవర్గాల అభ్యర్థులు కూడా నిధులు ఆశిస్తున్నారు. 2019 ఎన్నికల్లో తాము కోట్లు ఖర్చు పెట్టుకుని ఓటమి పాలయ్యామని, ఈసారి తాము ఎన్నికల ఖర్చును భరించలేమని ఇప్పుడే కొందరు చేతులెత్తుస్తున్నారట. ప్రధనంగా గతంలో అధికారంలో ఉన్నప్పుడు మంత్రులుగా ఉన్న వారు సయితం ఇదే మాటను చెబుతుండటం చంద్రబాబుకు ఇబ్బందిగా మారిందంటున్నారు. తమ వ్యాపారాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని అనేకమంది ఇప్పటికే చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారట. తమకు నిధులు అవసరమని నేరుగా చెప్పకపోయినప్పటికీ తాము అధికార పార్టీకి ధీటుగా వచ్చే ఎన్నికల్లో ఖర్చు చేయాలంటే పార్టీ నుంచి సాయం అవసరమని కొందరు ఇప్పటి నుంచే చెబుతుండటం విశేషం. దీంతో 175 నియోజకవర్గాల్లో దాదాపు వంద నియోజకవర్గాల్లో చంద్రబాబు నిధులను సమకూర్చాల్సిన అవసరం ఉందంటున్నారు. మొత్తం మీద చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో నిధుల సమస్య ఇబ్బందిగా మారే అవకాశముంది.

# రైతులు కుదేలు

అమరావతి, జూన్ 22, (న్యూస్ పల్స్)కూరగాయలు, ఆకు కూరలు, పళ్లు, పూలు పండించే రైతులకు కోవిడ్ కోలుకోలేని దెబ్బవేస్తోంది. సాగు దగ్గర నుంచి దిగుబడుల కోతలు, వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో ఈ రెండేళ్ల కాలంలో కూరగాయలు, పళ్లు, పూల పంటలను సాగుచేసే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ఏడాది వాతావరణం అనుకూలించినా కోవిడ్‌తో సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో పండించిన పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలీక రైతులు తీవ్రంగా నష్టపోయారు. కూరగాయాల ధరలు వినియోగదారునికి మార్కెట్‌లో చుక్కలు చూపిస్తున్నా ఆ ప్రతిఫలం రైతుకు దక్కని పరిస్థితి వుంది. ఆకుకూరలు, కూరగాయలు, పూలు కోతకోసిన వెంటనే మార్కెట్‌లో అమ్మకం జరిగితేనే రైతుకు అంతో ఇంతో ధర దక్కుతుంది. అమ్మకం ఒక్కరోజు ఆలస్యం అయినా పారబోయాల్సిన పరిస్థితి. సాధారణంగా ఉల్లికి ఈ సీజన్‌లో క్వింటా సగటున రూ2500పైనే రైతుకు లభించేది. ఇపుడు సగటున వెయ్యి నుండి 1300 రూపాయల మద్యనే రైతుకు ధర వస్తుండటంతో ఉల్లిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులూ తీవ్ర నష్టాలను మూటకట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో పండించే బంగినపల్లి రకం మామిడికి గల్ఫ్‌లో మంచి డిమాండ్. సాధారణ రోజుల్లో ఎక్స్‌పోర్ట్ బంగినపల్లి మామిడి రకం టన్ను రూ 80వేలకు పైబడి వుండేది. కోవిడ్‌తో ఎగుమతులు స్థంభించిపోవడం, స్థానిక మార్కెట్‌పైకూడా కర్ఫ్యూ ప్రభావంతో టన్ను రూ 40వేలకు కూడా కొనే నాథుడు లేని పరిస్థితి. అలాగే అరటి రైతులదీ అదే సమస్య గత ఏడాది అరటి ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలతో మార్కెటింగ్ చేసేందుకు ప్రణాళికను తయారు చేసినా కోవిడ్ తీవ్రతతో ఈ ప్రయోగం విఫలమయ్యింది. కోవిడ్‌తో రెండేళ్లనుండి పూలరైతులకు ఒక్కరూపాయి చేతికి రాని పరిస్థితి వుంది. టమోటా రైతులు సాగుకు దూరం అవుతున్న పరిస్థితి నెలకొంది.

# మద్దాలి గిరికి కలిసొస్తున్న కాలం

గుంటూరు, జూన్ 22, (న్యూస్ పల్స్)గుంటూరులోని కీలకమైన నియోజకవర్గం గుంటూరు పశ్చిమం. గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్త ప్రభంజనంలోనూ ఇక్కడ వైసీపీ పాగా వేయలేక పోయింది. గడిచిన రెండు ఎన్నికల్లో పోటీ చేసినా.. ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది. అమరావతిలోనే కీలక నియోజకవర్గాల్లో ఒకటి అయిన ఈ పశ్చిమంలో వైసీపీ తరఫున 2014లో లేళ్ల అప్పిరెడ్డి, 2019 చంద్రగిరి ఏసురత్నం పోటి చేశారు. అయితే.. ఆ రెండు ఎన్నికల్లోనూ ఈ ఇద్దరు నేతలు పరాజయం పాలయ్యారు. మరి ఇక్కడ గెలిచేది ఎలా? అనేది వైసీపీ నేతల మాట. ఈ క్రమంలోనే విజయవాడకు చెందిన మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సన్నిహితుడు, టీడీపీ తరఫున గెలిచిన మద్దాలి గిరిధర్‌ను పార్టీకి అనుకూలంగా మార్చుకున్నారు. అధికారికంగా ఆయన పార్టీ కండువా కప్పుకోకపోయినా.. వైసీపీ అనుకూల నేతగానే చలామణి అవుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి మద్దాలి గిరికే ఇక్కడ టికెట్ ఇచ్చే అవకాశం మెండుగా ఉంటుంది. అయితే నిన్నటి వరకు పశ్చిమ వైసీపీలో ఆ పరిస్థితి లేదు సరికదా ? మూడు ముక్కలాట కొనసాగింది. మద్దాలి గిరికి పార్టీలో ప్రయార్టీ ఇస్తే ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో పార్టీని డెవలప్ చేసిన.. లేళ్ల అప్పిరెడ్డి పరిస్థితి ఏంటి ? గత ఎన్నికల్లోనే ఆయనకు సీటు ఇవ్వలేదు కదా ? అప్పిరెడ్డి ఫ్యూచర్ కష్టమేనా అన్న అనుమానాల నేపథ్యంలో జగన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మద్దాలి గిరికి పోటీ లేకుండా చేసేందుకు.. ఇంకెవరూ ఆయనతో రాజకీయ రగడకు దిగకుండా చూసేందుకు జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ కోటాలో లేళ్ల అప్పిరెడ్డిని శాసన మండలికి పంపేస్తున్నారు. దీంతో వచ్చే ఆరేళ్ల వరకు కూడా లేళ్ల అప్పిరెడ్డి మండలి సభ్యుడిగానే కొనసాగనున్నారు. సో.. పశ్చిమలో ఆయన పోటీకి వచ్చే పరిస్థితి లేదు. ఇక, గత ఎన్నికల్లో పోటీ చేసిన ఓడిన చంద్రగిరి ఏసురత్నంకు ఇప్పటికే గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని అప్పగించారు. దీంతో ఈ నియోజకవర్గ వైసీపీలో నిన్నటి వరకు మూడు ముక్కలాటగా కొనసాగిన వార్‌కు తెరపడింది. అప్పిరెడ్డితో పాటు ఏసురత్నం కూడా ఇక్కడ మద్దాలి గిరికి పోటీకి వచ్చే అవకాశం లేదు. దీంతో మద్దాలి గిరికే పశ్చిమ వైసీపీ సీటు రిజర్వ్ అయిందన్న చర్చ వైసీపీ వర్గాల్లో నడుస్తున్నాయి

# ముందుకు సాగని డ్రోన్ సర్వే

అనంతపురం, జూన్ 22, (న్యూస్ పల్స్)వైఎస్ఆర్ జగనన్న స్వచ్ఛ భూహక్కు, భూరక్ష' కింద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ఆచరణలో లక్ష్యాలకు దూరంగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ సర్వేను 2022 మార్చి కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మండల సర్వేయర్లతోపాటు గ్రామ సర్వేయర్లకు ప్రభుత్వం విడతల వారీ శిక్షణ ఇస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా 13 జిల్లాల్లోని 51 డివిజన్లలో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు ఎంపిక చేశారు. తదనంతరం రాష్ట్ర వ్యాప్తంగా 612 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. సర్వే కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ హోదా ఉన్న అధికారిని నోడల్ అధికారిగా నియమించింది. సర్వేలో భాగంగా డ్రోన్ సర్వేను క్లస్టర్ల వారీ చేపట్టారు. భూసర్వేతోపాటు, భూ రికార్డుల స్వచ్ఛీకరణ (పిఒఎల్ఆర్) సమాంతరంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా రికార్డుల స్వచ్ఛీకరణ నడుస్తోంది. అడంగల్, ఆర్ఎస్ఆర్, వెబ్‌లాండ్ లెక్కలకు రికార్డుల్లోని గణాంకాలు డ్రోన్‌లు తీసిన ఛాయా చిత్రాలకు సరిపోకపోతుండటంతో సర్వే సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. 229 గ్రామాలకు సంబంధించిన పిఒఎల్ఆర్ పూర్తి కాగా, మరో 45 గ్రామాల డేటా పురోగతిలో ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. నూతనంగా కేటాయించిన 338 గ్రామాలకు 23 గ్రామాల భూ రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తికాగా, మరో 305 గ్రామాల రికార్డుల శుద్ధీకరణ పురోగతిలో ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద కేటాయించిన 612 గ్రామాల రికార్డుల స్వచ్ఛీకరణ ఈ నెల 30 కల్లా పూర్తి చేయాలనే లక్ష్యం ప్రశ్నార్థకంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డ్రోన్ తీసిన ఫోటోలకు, విలేజ్ మ్యాప్‌కు భూముల గట్లు, విస్తీర్ణంలో తేడాలు ఎలా పరిష్కరించాలనే అంశంపై ప్రభుత్వం వైపు నుంచి స్పష్టత ఇవ్వలేదని క్షేత్రస్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి విలేజ్‌మ్యాపు, అడంగల్, ఆర్ఎస్ఆర్ సరిపోయిన సర్వే నెంబర్లు మాత్రమే సర్వే చేస్తున్నామని, సరిపోని సర్వే నెంబర్లను ప్రస్తుతానికి పక్కనబెట్టి ముందుకు సాగుతున్నట్లు గ్రామ సర్వేయర్లు పేర్కొంటున్నారు. సర్వేకు సంబంధించి రోవర్లు సరిపడినన్ని సరఫరా లేకపోవడం, జంగిల్ క్లియరెన్స్ లేకపోవడం, ఎక్విప్‌మెంట్‌తోపాటు సరిపడినంత సిబ్బంది లేకపోవడం సర్వే ఆలస్యానికి కారణంగా భావిస్తున్నారు. సర్వే సెటిల్‌మెంట్ రికార్డు (ఎస్ఎస్ఎల్ఆర్) నివేదిక ప్రకారం చిత్తూరు జిల్లాలో రెండు డివిజన్లలోని 10 మండలాలను పైలెట్ సర్వేకు కేటాయించగా, నేటికీ పురోగతి '0'గా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# వైభవంగా బంగారమ్మ వారి పండగ

**పైడి తల్లి అమ్మ మారు వారం పండుగ**

**అమ్మవార్లకు గ్రామ ప్రజలు,భక్తులు పూజలు**

సింహాచలం, , జూన్ 22 అడివివరం గ్రామదేవత శ్రీ బంగారమ్మ వారి వార్షిక పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుండి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాత అడివివరంలోని అమ్మవారి సతకంపట్టు వద్దకు కూడా భక్తులు భారీగా తరలివెళ్లి మొక్కులుతీర్చుకున్నారు. అప్పన్న ధర్మ కర్తల మండలి ప్రత్యేక ఆహ్వా నీతులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్ట్ ల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు దంపతులు, 98 వార్డ్ కార్పొరేటర్ పీ వీ నరసింహం తదితరులు అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు. పైడితల్లమ్మ వారి దేవాలయంలో కూడా మారువారం పూజలు సంప్రదాయంగా జరిగాయి. గతవారం వీలుపడని గ్రామస్థులు అమ్మవారికి ఈవారం మొక్కులు చెల్లించుకున్నారు. పైడితల్లమ్మ వారి పండగ సందర్భంగా గతవారం సమన్వయ లోపంతో తలెత్తిన ఇబ్బందులను ఈవారం ఈవో సూర్యకళ ప్రత్యక్షంగా పర్యవేక్షించి చక్కదిద్దారు. కరోనా నేపథ్యంలో ఈవో ఆమె ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అమ్మవారి సన్నిధిలోకి వెళ్లి మొక్కులు చెల్లించుకునే అవకాశం కల్పించడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేవస్థానంతో పాటు బంగారుతల్లి యూత్ ఫ్రెండ్స్ ప్రతినిధులు భక్తులకు పొంగలి, పులిహోర, చక్కెరపొంగలి ప్రసాదాలను పంపిణీచేశారు. దేవస్థానం ఏ ఈఓ ఇజ్జిరోతు శ్రీనివాసరావు.. సుపరెండెంట్ ముద్దాడ రమణ.. సొసైటీ అధ్యక్షులు కర్రిస్వామి స్థానిక నేతలు సతివాడ శంకరరావు దొంతల సంతోష్ ఇతర పెద్దలు పాల్గొన్నారు . నక్క చందు ఏర్పాట్లూ చూశారు.. పైడితల్లి అమ్మవారి మారువారంపండుగ ఘనముగా జరిపించారు.. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు..

# రూ.24.87 కోట్లు వైయస్సార్ చేయూత మంజూరు

**పాడేరు శాసనసభ్యురాలు కోట్టగుల్లి భాగ్యలక్ష్మి**

విశాఖపట్నంజూన్ 22 మహిళలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా పథకాలను సద్వినియోగం చేసుకొని చిన్నతరహా పారిశ్రామికవేత్తలు గా ఎదగాలని పాడేరు శాసనసభ్యురాలు కోట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో రెండవ విడత వైయస్సార్ చేయూత పథకం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం పరిధిలోని 45 నుండి 60 సంవత్సరాల వయసు కలిగిన ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు ఒక్కొక్కరికి 18,750 రూ.లు చొప్పున 13270 మందికి రూ24 కోట్ల 87 లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు జమ చేస్తారని చెప్పారు. వైఎస్ఆర్ చేయూత ను సద్వినియోగం చేసుకొని మహిళలు చిన్న తరహా పరిశ్రమ వేతలుగా నిలవలని సూచించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళ పక్షపాతి అని పథకలన్ని మహిళల పేరుమీదే మంజూరు చేస్తున్నారన్నారు. మన్యంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి హోటల్ రంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రాజెక్టు అధికారిని కోరారు. మహిళలకు వెలుగు ద్వారా ఆహార పదార్థాల తయారీ పై తగిన శిక్షణ అందించి ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.వన్ దన్ వికాస్ కేంద్రాల ద్వారా గిరిజన ఉత్పత్తులకు అదనపు విలువలను జోడించి గిరిజన ఉత్పత్తుల విక్రయాలు చేయాలన్నారు. గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు ఆకర్షణీయమైన బ్రాండ్లతో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. మన్యంలో సాగుచేస్తున్న వేరుశెనగ ను చక్కిళ్లు గా తయారు చేసే యూనిట్ నెలకొల్పాలని అన్నారు. ఆ తరువాత తయారుచేసిన చక్కిళ్లు ను అంగన్వాడీ, విద్యా సంస్థలకు సరఫరా చేయడానికి కృషి చేయాలన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి . సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణ రోణంకి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకొని గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఇల్లాలు బాగుంటే ఇల్లు బాగుంటుందని వైయస్సార్ చేయూత పథకాన్ని సద్వినియోగం చేసుకుని గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కొనుగోలు, చేయాలన్నారు. గిరిజన మహిళలు రాజకీయ సాధికారత సాధించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రెండవ విడత చేయూత పథకాన్ని సొంత ఖర్చులకు వినియోగించకుండా వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయి అన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ24 కోట్ల 87 లక్షల చెక్కును అతిధుల చేతులమీదుగా అందజేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, స్థానిక సర్పంచ్ ఉషారాణి,ఎంపీడీవో నరసింహారావు, వెలుగు వి మురళి, కె నీలాచలం, కె అన్నపూర్ణ ,ఏ పీ ఓ కళావతి స్థానిక వైసీపీ నేతలు రమణమూర్తి, బుల్లిబాబు, రాంబాబు,విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్‌కి 'నిషా' ఎక్కుతోంది



**డిజిటల్‌లో పెరుగుతున్న ఆల్కహాల్ బ్రాండ్ ప్రమోషన్**

**సంప్రదాయ పద్దతిలో ఆల్కహాల్ ప్రచారంపై నిషేధం**

**ఆన్‌లైన్ ప్రచారానికి మొగ్గు చూపుతున్న ఆల్కహాల్ కంపెనీలు**

ఆల్కహాల్ బ్రాండ్లు డిజిటల్ బాట పట్టాయి. ఇంటర్నెట్ వేదికగా ప్రచారం చేయడంపై దృష్టి సారించాయి. ఈ కామర్స్ సైట్లలో స్థానం ఆక్రయమించి తమ బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నాయి. గత రెండేళ్లుగా ఈ ట్రెండ్ పెరిగింది. ఆల్కహాల్, పొగాకు ఉత్పత్తులపై ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించించి. పత్రిక, టీవీ, హోర్డింగ్ తదితర సంప్రదాయ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడాన్ని నిషేధించాయి. దీంతో చాలా ఆల్కహాల్ కంపెనీలు మినరల్ వాటర్, క్యాసెట్స్ అండ్ సీడీస్ , ప్యాకేజ్డ్ వాటర్ తదితర పేర్లతో తమ బ్రాండ్లను పరమిత స్థాయిలో ప్రచారం చేస్తున్నాయి.సంప్రదాయ పద్దతిలో ఆల్కహాల్ ప్రచారానికి అనేక అడ్డంకులు ఉండటంతో ఆల్కహాల్ కంపెనీలు డిజిటల్ బాట పట్టాయి. గతేడాది ఆల్కహాల్ ప్రచారంపై తయారీ సంస్థలు రూ. 750 కోట్లు ఖర్చు చేశారని అంచనా. ఇందులో కనీసం 25 నుంచి 28 శాతం వరకు అడ్వర్‌టైజ్‌మెంట్లు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కే దక్కాయి. అంతకు ముందు ఏడాది ఈ వాటా18 నుంచి 20 శాతం మధ్యనే ఉంది. ఫన్, ఇన్ఫర్మేటివ్ పద్దతిలో క్రియేటివ్‌గా రూపొందించిన యాడ్స్‌ని ఈ కామర్స్ సైట్స్, ఓటీటీ , సోషల్ మీడియా ద్వారా ప్రముఖ కంపెనీలు ప్రచారం చేస్తున్నాయి. దీనికి తోడు కరోనా సెకండ్ వేవ్ సందర్భంగా ఢిల్లీ, వెస్ట్ బెంగాల్, ఒడిషా, మహారాష్ట్ర, ఝార్కండ్ తదితర రాష్ట్రాలు ఆల్కహాల్ హోం డెలివరీకి అవకాశం కల్పించాయి. దీంతో ఆల్కహాల్ యూజర్లు కూడా డిజిటల్ బాట పడుతున్నారు. న్‌లైన్‌లో ఆల్కహాల్ డెలివరీ ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది.

# సత్వర వ్యాక్సినేషన్‌తోనే సాధారణ స్థితి : నీతి ఆయోగ్



న్యూఢిల్లీ : భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా మంగళవారం ఒక్కరోజులో అత్యధిక మందికి వ్యాక్సినేషన్ చేపట్టిన నేపథ్యంలో సత్వర వ్యాక్సినేషన్‌తోనే దేశంలో సాధారణ పరిస్థితి నెలకొంటుందని నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే పాల్ పేర్కొన్నారు. మనం త్వరగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడితే స్కూళ్లు, విద్యా, వాణిజ్య సంస్థలు తెరవడంతో పాటు ఆర్థిక వ్యవస్థ గాడినపడేందుకు వెసులుబాటు కలుగుతుందని అన్నారు. శీఘ్రగతిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళితేనే ఇది సాధ్యపడుతుందని చెప్పారు. కరోనా సెకండ్ వేవ్ వ్యాప్తి తగ్గుముఖం పట్టిన క్రమంలో ప్రతిఒక్కరూ కొవిడ్-19 వ్యాక్సిన్ తీసుకునేందుకు ఇదే సరైన సమయమని చెప్పారు. భారతీయ వ్యాక్సిన్లు సురక్షితం కాదని కొందరు అపోహ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అన్ని వ్యాక్సిన్లు అత్యవసర వాడకానికి ఆమోదం పొందాయని డాక్టర్ పాల్ వివరించారు. ఆరోగ్య కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి ముందుగా వారికి వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా సెకండ్ వేవ్ వ్యాప్తిని వైద్య సిబ్బంది దీటుగా నిలువరించగలిగారని చెప్పారు. కేవలం కొద్దిమంది ఆరోగ్య కార్యకర్తలే ఇన్ఫెక్షన్‌కు గురయ్యారని, లేనిపక్షంలో సెకండ్ వేవ్ విరుచుకుపడటంతో మన దవాఖానాలు చేతులెత్తేసి ఉండేవని అన్నారు.

# భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

కర్నూలు జూన్ 22 పంచ లింగాల రాష్ట్ర సరిహద్దు సేఫ్ చెక్ పోస్టు లో మంగళ వారం తెల్లవారు జామున సేబ్ సి ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనతనిఖీలె చేపట్టారు. ఆ సమయంలో తెలంగాణ వైపు నుండి ఒక స్కార్పియో వేగంగా వచ్చింది. అందులో సీట్లు కనపడక పోవడంతో సేబ్ సిబ్బంది ఆపడానికి ప్రయత్నించారు. వాహనం ఆపకుండా వెళ్లగా, అనుమానం తో స్కార్పియో ను వెంబడించి పట్టుకున్నారు. ,అందులో తెలంగాణ అక్రమ మద్యము బాటిళ్లు వున్నట్లు గుర్తించి,స్కార్పియో ను సోదా చెసారు. కూర్చొనే సీట్లన్నీ తొలగించి వాటి స్థానంలో దాచిన సుమారు 50 కాటన్ బాక్స్ ల్లో 716 బాటిళ్లు తెలంగాణ అక్రమ మద్యము బయటపడింది. స్కార్పియో వాహనం నడిపిన వ్యక్తి, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

# మాజీ ఎమ్మెల్యే బిసి కి బెయిల్ మంజూరు

**సమయం దాటిపోవడంతో ఇవాళ ఉదయం**

**జైలు నుంచి రిలీజ్**

కర్నూలు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డికి ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. . కర్నూలు 6వ అదనపు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ప్రతినెలా రెండు, నాలుగో శనివారాలు బనగానపల్లి పోలీసుస్టేషన్లో హాజరై సంతకాలు చేయాలన్న షరతుతో న్యాయమూర్తి బెయిల్ ఇచ్చారు. గత నెలలో బనగానపల్లిలో జరిగిన ఘర్షణ కేసులో బీసీ జనార్ధన్రెడ్డితోపాటు ఆయన అనుచరులు శీను, దివాకర్, విజయారెడ్డి, పెద్ద ఉశేని, మురళీమోహన్రెడ్డి, రమణ, నరసింహ, అత్తర్ సాహెబ్తోపాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆదోని సబ్ జైలులో బిసి ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం బెయిల్ మంజూరైంది. ఆ రోజే సాయంత్రం రిలీజ్ అవ్వాలి అయితే సమయం దాటిపోవడంతో మంగళవారం ఉదయం రిలీజ్ అయ్యారు. అధికారం తో కేసులు పెట్టిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని బిసి అన్నారు. మరోవైపు బనగానపల్లె పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# ఘటన ఎంతో కలవరించింది

విజయవాడ, జూన్ 22, (న్యూస్ పల్స్)తాడేపల్లిలోని ప్రకాశం బ్యారేజీ వద్ద నర్సింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన తన మనసును కలచివేసిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో ఎక్కడా జరగకూడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు అర్ధరాత్రి కూడా తిరగగలిగే పరిస్థితి ఉన్నప్పుడే.. నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు గట్టిగా నమ్మే వ్యక్తిని తానని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.మహిళల భద్రత కోసం దిశ, అభయం యాప్‌లతో పాటు వారి రక్షణ కోసం దిశ చట్టం చేసినట్లు సీఎం జగన్ గుర్తు చేశారు. మహిళల రక్షణ కోసం దిశ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో మహిళా పోలీసులను నియమించామని.. మహిళల కోసం ప్రత్యేకంగా 900 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామని సీఎం జగన్ తెలిపారు.ప్రకాశం బ్యారేజీ వద్ద అత్యచార ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని సీఎం జగన్ వెల్లడించారు. ఇలాంటి ఘటన జరిగినందుకు చింతిస్తూ.. భవిష్యత్తులో పునవృతం కాకుండా ఉండేందుకు ఇంకా ఎక్కువగా కష్టపడతానని చెప్పారు. కాగా, ఇప్పటికే డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను సీఎం జగన్ సోమవారం తన క్యాంప్ కార్యాలయానికి పిలిపించుకుని ఘటనపై ఆరా తీశారు. నిందితులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకూడదని.. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు.

# రేవంత్ రెడ్డి అనుచరుడికే టిక్కెట్

హైదరాబాద్, జూన్ 22, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత, ఎంపీరేవంత్ రెడ్డి వర్గీయుడు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈయన మాజీ మంత్రి, దివంగత టీడీపీ నేత ముద్దసాని దామోదర్ రెడ్డి తనయుడు. ఈయన తాజాగా కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ సమక్షంలో కశ్యప్ రెడ్డి టీఆర్ఎస్‌లో చేరారు. రేవంత్ రెడ్డి వర్గీయుడు ఇలా టీఆర్ఎస్ పార్టీలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది.మాజీ మంత్రి ముద్దసాని దామోదర్ రెడ్డి మరణం తరువాత 2014లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కశ్యప్ రెడ్డి తొలిసారిగా హుజూరాబాద్ నుంచి బరిలో నిలిచారు. టీడీపీ, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన కశ్యప్ రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. తరువాత ఎంపీ రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లో చేరారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నం చేసినా అది కుదరలేదు. దీంతో తాజాగా ఆయన టీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఈయన్ను హుజురాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని ప్రచారం జరుగుతోంది.

# దేవగౌడకు 2 కోట్ల పరువు నష్టం

బెంగళూర్, జూన్ 22, (న్యూస్ పల్స్)మాజీ ప్రధాని దేవెగౌడ ఓ కార్యక్రమంలో నోరుజారి భారీ మూల్యమే చెల్లించుకున్నారు. ఆయన చేసిన వ్యాఖ్యల వల్ల తమ సంస్థ ప్రతిష్ఠ దెబ్బతిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.ఓ నిర్మాణ సంస్థ పరువుకు భంగం వాటిల్లేలా వ్యాఖ్యలు చేసినందుకు మాజీ ప్రధానికి న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. సదరు సంస్థకు పరువు నష్టం కింద రూ.2 కోట్ల చెల్లించాలని ఆదేశించింది. నందిన్ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ఎంటర్‌ప్రైజ్ (నైస్) అనే సంస్థపై మాజీ ప్రధాని దేవేగౌడ 2011లో వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ సంస్థ తమ పరువుకు భంగం వాటిల్లిందని ఆరోపిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన బెంగళూరులోని సిటీ సివిల్ అండ్ సెషన్స్ అదనపు న్యాయస్థానం తీర్పు వెలువరించింది.నైస్ సంస్థకు రూ.2 కోట్లు పరిహారం చెల్లించాలని మాజీ ప్రధానిని సివిల్ కోర్ట్ న్యాయమూర్తి మల్లన గౌడ ఆదేశించారు. గతంలో ట్రయల్ కోర్టు ఆదేశాలపై అసంతృప్తి చెందిన దేవగౌడ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన పిటిషన్‌ను ఆ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. తమకు రూ.10కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నైస్ దాఖలు చేసిన పిటిషన్పై విచారణ చేపట్టింది. ఈ క్రమంలో దేవగౌడ తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవడంలో విఫలం కావడం వల్ల తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.కేసు వివరాల్లోకి వెళితే 2011 జూన్ 28న ఓ కన్నడ న్యూస్ ఛానెల్‌లో ప్రసారమైన "గౌడర గర్జన' కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవగౌడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైస్ సంస్థ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు.

# నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా అమ్మి రెడ్డి నియామకం

నెల్లూరు జూన్ 22, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా గుంటూరు గ్రామీణ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న అమ్మి రెడ్డి నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా ఎస్పీ గా పనిచేస్తున్న ఎస్పీ భాస్కర్ భూషణ్ కేంద్ర సర్వీసులకు బదిలీ కాబడ్డారు. ఈ క్రమంలో హాలో నెల్లూరు జిల్లా ఎస్పీగా నియామకాలు జరిపేందుకు జిల్లాకు చెందిన మంత్రులు ప్రభుత్వంతో మంతనాలు జరిపారు. ఎట్టకేలకు నెల్లూరు జిల్లా ఎస్పీ గా అమ్మి రెడ్డి నియామకం కావడంతో జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నెల్లూరు జిల్లాలో అధికంగా ఇసుక మాఫియా జరుగుతున్న సమయంలో అమ్మి రెడ్డి జిల్లా ఎస్పీగా రావడం జరుగుతుంది. ఇసుక మాఫియా పై అమ్మి రెడ్డి ఎటువంటి చర్యలు తీసుకుంటారో, ఇసుక మాఫియా తగ్గించే ప్రయత్నాలు ఎలా చేస్తారు అనేది సింహపురి ప్రజల్లో విమర్శనాత్మక ధోరణి లో ఉన్నారు. గత వారం పది రోజులుగా నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని గొల్ల కందుకూరు రీచ్ నుండి 10 రోజుల లో 500 కోట్ల ఇసుక మాఫియా జరిగినట్లు ఆధారాలతో టిడిపి నాయకులు నిరూపించబడింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చక్రధర బాబు కు జిల్లా టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. జిల్లాకు ఎస్పీగా నియామకం కాబడిన అమ్మి రెడ్డి కి ఇసుక మాఫియా తొలి చాలెంజ్ గా నిలవనుంది.

# రేవతి జన్మదిన సందర్భంగా వృద్ధులు కు అన్నదానం

దర్శి జూన్ 22, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా,దర్శి శ్రీ సాయిబాబా వృద్ధాశ్రమం లో వృద్ధులు కు ప్రతి రోజు అన్నదానం చేస్తారు. ఈ కార్యక్రమం లో భాగంగా మంగళవారం దర్శి లో మెయిన్ బజార్ వాస్తవ్యులు సముద్రాల రేవతి పుట్టినరోజు సందర్భంగా దరిశి కురిచేడు రోడ్డు లోని శ్రీ షిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం,దుప్పట్లు,మాస్కులు మరియు పండ్లు మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్బంగా వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు మస్తాన్ వలి మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ తమ వంతు వృద్ధులు కు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం పాల్గొన్న వారు వారి కుటుంబ సభ్యులు వారి భర్త సముద్రాల వెంకట శివ దుర్గ మరియు నితిన్,నిశాంత్ మరియు నిర్వాహకులు పాల్గొన్నారు ఆశ్రమం ఫోన్ నెంబర్:-9573721114, 9948655377

# బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేందర్ రెడ్డి

వర్ధన్నపేట, జూన్ 22, బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై బాల్య వివాహాలను అరికట్టేందుకు సహకరించాలని,బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి గాదె మహేందర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన దొనికెల విజయ కూతురుకి బాల్య వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్న సమాచారంతో వర్ధన్నపేట ఎస్ఐ వంశీకృష్ణ,జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేందర్ రెడ్డి,ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ స్వరూప,చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యురాలు మమత కలిసి గ్రామంలోని విజయ నివాసానికి చేరుకొని కౌన్సిలింగ్ నిర్వహించి బాల్య వివాహాన్ని నిలిపివేశారు.జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బాలిక చదువు నిమిత్తం తగిన విధంగా సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. అనంతరం ఎస్ఐ వంశీకృష్ణ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధమని,ఎవరైనా బాల్య వివాహానికి సహకారం అందించినట్లు అయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ఈతముక్కల లో నేడు క్షిప్ర గణపతి ప్రతిష్ట

ఒంగోలు ప్రకాశం జిల్లా కొత్త పట్నం మండలం ఈత ముక్కల గ్రామం శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం లో నేడు వేద పండితులు ఎల్లా ప్రగధ వెంకట సత్య కృష్ణ ప్రసాద్, భక్త బృందం ఆధ్వర్యంలో క్షిప్ర గణపతి ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుంది అని వేదపండితులు తెలిపారు.ఈ కార్యక్రమం లో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని కోవిడ్ నిబంధనలు పాటించ వలిసిందిగా కోరుచున్నారు.గత మూడు రోజులు నుండి దైనందిన పూజ మరియు హోమం,జరుగుతుంది అని తెలిపారు.ప్రతిష్ట అనంతరం భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించి తీర్థ ప్రసాదాలు స్వీకరించ వలిసిందిగా కోరుచున్నారు. ఈ కార్యక్రమం లో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొనవలసినదిగా కోరుచున్నారు.

## భూ ఆక్రమణలను అరికట్టండి బిజెపి

డోన్ జూన్ 22 భూ ఆక్రమణల ను అరికట్టండి అని డోన్ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు, స్థానిక మండలంలో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలను మరియు దేవాలయ భూములను కొందరు భూ భాకాసురులు అక్రమణలకు పాల్పడుతున్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే మహారాజు అధ్యక్షతన డిప్యుటీ తహసీల్దార్ వారికీ మెమోరాండం సమర్పించారు, ఈ సందర్బంగా బిజెపి జిల్లా నాయకులు హేమసుందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పెద్ద మల్కాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 99 మరియు 108 ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడం జరుగుతుందని దానిని వెంటనే నిలుపుదల చేయాలనీ అదేవిదంగా పట్టణ సమీపంలోని దేవాదాయ భూములను సైతం అక్రమణకు గురవుతున్నాయని వాటిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు ఆరోపించారు, ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, గ్రామస్థులు ఈశ్వర్ రెడ్డి, చెన్నకేశవ, మల్లికార్జున, రామకృష్ణ రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# వంట గది నిర్మాణం విషయంలో పాటించవలసిన వాస్తు నియమాలు



ఏ సంస్కృతిలో పుట్టి పెరిగినా, మనం తీసుకునే ఆహారం, మన ఆరోగ్యం మరియు శ్రేయస్సులో ప్రధాన పాత్ర పోషిస్తుంది. మనం తీసుకునే ఆహారం పోషక పరంగా మన శరీరం మరియు మనస్సును ప్రభావితం చేస్తుందనడాన్ని ఎవరూ కాదనలేరు. వాస్తవానికి, మనం ఆహారం సిద్ధం చేసేటప్పుడు పాటించే పరిశుభ్రత కూడా మన ఆరోగ్య విషయంలో ప్రధాన్యత సంతరించుకుంది.అందువల్ల, దేశంలో ఏ మూలకి వెళ్లినా, వంటగది యొక్క పరిశుభ్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది. గతంలో, సాంప్రదాయిక గృహాలలో, వంటగది ఇంటి నుండి పూర్తిగా వేరుగా ఉండేది.వంట గది నిర్మాణం విషయంలో పాటించవలసిన వాస్తు నియమాలువంట గది నిర్మాణం విషయంలో పాటించవలసిన వాస్తు చిట్కాలుఈ రోజుల్లో చాలా గృహాలలో (ఫ్లాట్లతో సహా), వంటగదిని ఆనుకుని డైనింగ్ హాల్ కలిగివున్నప్పటికీ, గృహంలో వంటగది యొక్క స్థానం ఆ గృహంలోని సంపద మరియు ఆరోగ్యాన్ని నిర్దేశిస్తుంది.పైన చెప్పినవన్నీ వాస్తవానికి, భారతీయ సంప్రదాయ వాస్తు శాస్త్రంలో చెప్పబడిన విషయాలే! నేడు, ఆధునిక మనస్తత్వవేత్తలు కూడా వంటగది యొక్క స్థానం, మన మానసిక శ్రేయస్సు విషయంలో ముఖ్యపాత్రను పోషిస్తుందని ధ్రువీకరించారు. ఈ వ్యాసం ద్వారా, మనము ఇంట్లో వంటగది యొక్క స్థానం గురించి తెలుసుకుందాం. వాస్తు శాస్త్రంలో పేర్కొన్న విధంగా, మీరు ఖచ్చితంగా అమలు చేయడం సాధ్యం కాకపోతే, అనుసరించదగిన మార్గాలను ఇప్పుడు చర్చిద్దాము.వంటగది యొక్క దిశశాస్త్ర ప్రకారం, మీ ఇల్లు ఏ దిశలో ఉన్నా , వంటగది మాత్రం ఎల్లప్పుడూ ఆగ్నేయ దిశలోనే ఉండాలి. వంటగది లోపల, మీరు ఆహారాన్ని వండే గట్టు తూర్పు వైపుగా ఉండాలి. ఆధునిక హంగులను సమకూర్చుకున్న వంటగదిలో, మైక్రోవేవ్ ఓవెన్, ఇండక్షన్ ఓవెన్, గ్యాస్ బర్నర్, మొదలైనటు వంటి పలు సదుపాయాలు ఉంటాయి.వంటగది గట్టుపై మీరు ఏ పద్ధతిని ఉపయోగించి వంట చేస్తారో దానికి అనుకూలమైన పరికరాలను అమార్చాలి. ఆహారాన్ని తయారుచేసే సమయంలో, తయారు చేసే వారు, తూర్పు ముఖంగా ఉంటే, వారి తనుమనస్సులను వంటలో సంపూర్ణంగా నిమగ్నం చేయగలుగుతారు. దీని వల్ల ఆహారంలో రుచి, శుచి మరియు ఆరోగ్యం నిండుతాయని వాస్తు శాస్త్రం పేర్కొంది.ౠనవులపై దీని ప్రభావం:ఇక్కడ గమనించదగ్గ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, వంటగది సరైన స్థానంలో ఉంటే వంట చేసే వ్యక్తికి సదుపాయంగా ఉండటమే కాక, ఆహారాన్ని తినే వారికి కూడా మేలుచేస్తుందనే వాస్తవాన్ని వాస్తు శాస్త్రం కనుగొంది.అటువంటి స్వల్ప మార్పులు చేసుకోవడం వలన కలిగే ఫలితం మూలంగా, మొత్తం కుటుంబ సభ్యులలో అనుకూల భావాలు నిండి ఉంటారు. అంతేకాక, కుటుంబ సభ్యులు వివిధ రకాల దుష్ప్రభావాల నుండి దూరంగా ఉంటారు. ఇటువంటి పరిస్థితులు నెలకొన్న కుటుంబంలోని సభ్యుల మధ్య ప్రేమ మరియు మెరుగైన పరస్పర అవగాహన ఉంటుంది.త్యామ్నాయ పరిష్కారాలు:కొన్ని సందర్భాల్లో పైన పేర్కొన్న విధంగా సరైన దిశలో వంటగదిని నిర్మించటం సాధ్యం కాకపోవచ్చు. అటువంటి సందర్భంలో, వంటగది ఇంటి మధ్యభాగంలో లేదా ఉత్తర దిశ ముఖంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకుండా చూసుకోవాలి.అటువంటి దిశలో కట్టబడిన వంటగది, మీ కుటుంబం యొక్క శ్రేయస్సుకి హానికరంగా పరిణమిస్తుంది. మీ ప్రస్తుత ఇంట్లో వంటగది, ఇటువంటి ప్రదేశాలలో ఉన్నట్లయితే, మీ కుటుంబానికి జరగబోయే హాని లేదా అనారోగ్యం యొక్క ప్రభావం తగ్గించడానికి మీరు వీలైనంత త్వరగా అవసరమైన మార్పులను చేసుకోండి.ఇతర చిట్కాలు మరియు సూచనలు:ఈ రోజుల్లో రిఫ్రిజిరేటర్ లేని వంటగదిని ఊహించలేము. వాస్తు శాస్త్ర ప్రకారం, రిఫ్రిజిరేటర్ ను వంటగది యొక్క పశ్చిమంలో పెట్టాలి.

## తొలగని వరుణుడి అడ్డంకి..ఐదో రోజూ డౌటే..!

సౌథాంప్టన్: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌కు వరుణుడి అడ్డంకి తొలగడం లేదు. ఐదో రోజు కూడా సౌథాంప్టన్‌లో వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో ఈ రోజు ఆట సాధ్యాసాధ్యాలపై కూడా అనుమానాలు నెలకొని ఉన్నాయి. వాతావరణ శాఖ తాజా సమాచారం ప్రకారం ఈ రోజు మధ్యాహ్నం వరకు జల్లులు పడే అవకాశం ఉందని తెలుస్తోంది. అవుట్ ఫీల్డ్ అంతా చిత్తడిగా మారిపోవడంతో హెలికాప్టర్ల ద్వారా ఆరబెట్టే ప్రయత్నం సాగుతుంది.కాగా, ఇప్పటికే వర్షం కారణంగా రెండు రోజుల ఆట పూర్తిగా రద్దైంది. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 217కు ఆలౌట్ కాగా, కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉన్నా.. ఫలితం తేలే అవకాశాలు లేకపోవడంతో అభిమానులు తీవ్రస్థాయిలో విచారం వ్యక్తం చేస్తున్నారు.

# సైలెంట్ ట్రీట్! ధనుష్ తో శేఖర్ కమ్ముల త్రిభాషా చిత్రం!!




కోలీవుడ్ సూపర్ స్టార్ ధనుష్ ఖ్యాతి విశ్వవిఖ్యాతం అయిన ఇలాంటి క్రేజీ సమయంలో టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల అతడితో ఓ త్రిభాషా చిత్రానికి రూపకల్పన చేయడం షాకింగ్ సర్ ప్రైజ్ అనే చెప్పాలి. ఈ క్రేజీ మూవీకి నారాయణ్ దాస్ కె నారంగ్ -పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మాతలు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి బ్యానర్ లో త్రిభాషా చిత్రంగా తెరకెక్కనుంది. దివంగత సునీతా నారంగ్ పుట్టినరోజు సందర్భంగా నేడు ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని సోనాలి నారంగ్ ప్రకటించారు.ఓవైపు ధనుష్ తన తాజా చిత్రం జగమే తంత్రం (జగమే తందిరం-తమిళ్) రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు. అవెంజర్స్ దర్శకులు రస్సో బ్రదర్స్ తో 'ది గ్రేమ్యాన్' అనే చిత్రంలోనూ నటిస్తూ ఆకాశమే హద్దుగా దూసుకెళుతున్నారు. ఇంతకుముందే జగమే తంత్రం నెట్ ఫ్లిక్స్ రిలీజ్ సందర్భంగా రస్సో బ్రదర్స్ అతడికి శుభాకాంక్షలు చెప్పడం అభిమానులను సర్ ప్రైజ్ చేసింది.అంత పెద్ద క్రేజీ స్టార్ తో సడెన్ సర్ ప్రైజ్ ని ప్రకటించారు కమ్ముల - నారంగ్ బృందం. ఇన్నాళ్లు తనవైన సెన్సిబుల్ కథాంశాలతో లవ్ స్టోరీస్ తో కమ్ముల ప్రత్యేక ఒరవడి సృష్టించి ఇప్పుడు ధనుష్ లాంటి ఇంటర్నేషనల్ క్రేజీ స్టార్ తో ఎలాంటి సినిమా తీయబోతున్నారు? అన్న ఉత్కంఠ ఇప్పుడు అభిమానుల్ని నిలవనీయదనడంలో సందేహమేం లేదు.ధనుష్ బహుముఖ ప్రజ్ఞ .. నటనతో పాత్ బ్రేకింగ్ చిత్రాలతో వరుస విజయాలు అందుకుంటున్న ఇలాంటి క్రేజీ టైమ్ లో కమ్ముల ప్లాన్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలుగు-తమిళ - హిందీ భాషలలో ఒకేసారి ఈ సినిమా తెరకెక్కనుంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి (ఎ యూనిట్ ఆఫ్ ఏషియన్ గ్రూప్) ప్రొడక్షన్ నం 4 అత్యంత భారీగా ఉంటుందని తెలుస్తోంది. ఆసియా గ్రూప్ - ఫిల్మ్ ఎగ్జిబిషన్ .. డిస్ట్రిబ్యూషన్ బిజినెస్ లో ఒక పురాణ బ్రాండ్ కొన్ని అద్భుతమైన కంటెంట్-ఆధారిత చిత్రాలను రూపొందిస్తోంది. ఇప్పుడు పాన్-ఇండియా మార్కెట్లను లక్ష్యంగా వరుస చిత్రాల్ని చేయనుందని నిర్మాతలు తెలిపారు. ఈ బృందం వివిధ భాషల స్టార్లు.. అత్యున్నత సాంకేతిక బృందంతో చర్చలు జరుపుతోంది. త్వరలో వివరాల్ని వెల్లడించనున్నారు.

## హ్యాట్సాఫ్ టు ధనుష్.. అవెంజర్స్ దర్శకుల మనసు దోచిన గ్రేట్ స్టార్!

కోలీవుడ్ సూపర్ స్టార్ గా ధనుష్ అజేయమైన ట్రాక్ రికార్డ్ గురించి తెలిసిందే. జాతీయ ఉత్తమ నటుడిగా అతడికి ఉన్న ఫాలోయింగ్ అసాధారణం. రాంజానా చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోనూ తనదైన ఫాలోయింగ్ ని సంపాదించిన ధనుష్ తదుపరి హాలీవుడ్ మూవీలోనూ నటిస్తున్నాడు.అవెంజర్స్ దర్శకులు జో రస్సో - ఆంథోని రస్సో ద్వయం తెరకెక్కిస్తున్న అత్యంత భారీ బడ్జెట్ చిత్రం 'ది గ్రే మ్యాన్' లో ధనుష్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఒక నవల ఆధారంగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇది. ఇక ఈ మూవీ కంటే




ముందే తమ హీరో నటించిన 'జగమే తందిరమ్' విడుదలపై అవెంజర్స్ ఎండ్ గేమ్ దర్శకులు తమిళంలో ధనుష్ కి విషెస్ చెప్పడం ఆశ్చర్యపరిచింది. ధనుష్ నటిస్తున్న గ్యాంగ్ స్టర్ డ్రామా జగమే తంత్రం (జగమే తందిరమ్) నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కానుంది. కార్తీక్ సుబ్బరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శశికాంత్ నిర్మాత. దాదాపు 17 భాషలలో 190 దేశాలలో విడుదల కానుంది.తాజాగా జో రుస్సో- ఆంథోనీ రస్సో ట్విట్టర్ లో ధనుష్ కి తమిళంలో శుభాకాంక్షలు తెలిపారు. "సూపర్ డా తంబి! ధనుష్ కె రాజాతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. బెస్టాఫ్ లక్ చ జగమే తందిరం" అని రస్సో బ్రదర్స్ ట్వీట్ చేశారు. ధనుష్ దానికి ఎంతో వినయంగా రీట్వీట్ చేస్తూ.."ఇంత ఆనందం నాది సార్. చాలా ధన్యవాదాలు. మీరు చాలా స్వీట్" అని రిప్లయ్ ఇచ్చారు. ఈ సంభాషణ అంతర్జాలంలో వైరల్ గా మారింది.ధనుష్ అభిమానులంతా గర్వించదగిన అరుదైన సందర్భమిది. ప్రపంచంలోనే బిలియన్ డాలర్ వసూళ్లతో సంచలన సినిమాలు తీసిన లెజెండరీ హాలీవుడ్ దర్శకులు ధనుష్ పై అభిమానం కురిపించడం అతడి సినిమా విజయం సాధించాలని కోరడం నిజంగా ఆశ్చర్యపరిచేదే. ఇలాంటి అరుదైన సందర్భం ఇతర హీరోలకు అంత సులువుగా దక్కేది కాదు.

# యూట్యూబ్ లో సంచలనంగా మారిన 'రౌడీ' ఫ్లాప్ మూవీ

ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో అడుగు పెట్టటం ఒక ఎత్తు.. అవకాశాలు చేజిక్కించుకోవటం మరో ఎత్తు. ఇవన్నీ సాఫీగా జరిగినా ప్రేక్షకుల మదిని దోచుకోవటం అన్నింటికంటే కష్టమైన.. క్లిష్టమైన అంశం. అయితే.. తన సినిమాతో ఇటీవల కాలంలో ఏ యువ హీరోకు రానంత క్రేజ్ ను సొంతం చేసుకోవటమే కాదు.. తానంటే చాలు పిచ్చెక్కిపోయేలా ఫ్యాన్స్ ను భారీగా సంపాదించటం విజయ దేవరకొండకే చెల్లింది.అతగాడు నటించిన అర్జున్ రెడ్డి మూవీ అతన్ని ఓవర్ నైట్ స్టార్ ను చేసేసింది. కోట్లాది మందిని అభిమానులుగా చేయటమే కాదు.. యూత్ లో స్పెషల్ క్రేజ్ ను సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన గీతాగోవిందం మరో బ్లాక్ బస్టర్ మూవీ. దాని సక్సెస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమాల్లోనే కాదు.. బయటా తనదైన తీరుతో మిగిలిన వారికి భిన్నంగా మారి.. అభిమానులకు మరింత దగ్గరయ్యాడు. దీంతో.. అతగాడ్ని రౌడీ అంటూ ముద్దుగా పిలుచుకోవటం తెలిసిందే. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన 'డియర్ కామ్రేడ్' ఫ్లాప్ అయ్యింది. అది కూడా అలాంటి ఇలాంటి ఫ్లాప్ కాదు. ఒకరకంగా విజయ్ కు ఊహించలేనంత షాకిచ్చింది. ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళ.. కన్నడ.. మలయాళంలోనూ రిలీజ్ చేశారు. ఈ సినిమాను తీస్తున్న సమయంలోనే హిందీలో ఈ



సినిమాను రీమేక్ చేసేందుకు ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ రెఢీ అయ్యారు. కాకుంటే.. సినిమా ఫ్లాప్ కావటంతో వెనక్కి తగ్గారు.ఆఫ్ లైన్ లో దారుణంగా ఫ్లాప్ అయిన మూవీ ఆన్ లైన్ లో మాత్రం అదరగొట్టేసింది. ఊహించని రీతిలో సక్సెస్ కావటమే కాదు.. రికార్డు స్థాయి వ్యూస్ ను సొంతం చేసుకుంది. గత ఏడాది జనవరి 19న ఈ మూవీని యూ ట్యూబ్ లో అప్ లోడ్ చేశారు. ఆన్ లైన్ లో అందుబాటులోకి వచ్చిన 24 గంటల వ్యవధిలోనే 1.20కోట్ల వ్యూస్ ను సొంతం చేసుకొని హాట్ టాపిక్ గా మారింది.దాదాపు ఏడాదిన్నర అవుతున్న వేళ.. మరో రికార్డును సొంతం చేసుకుంది. తాజాగా ఈ మూవీ 250 మిలియన్ వ్యూస్.. అంటే 25 కోట్ల వ్యూస్ ను రాబట్టి సంచలన విజయాన్ని సాధించింది. వ్యూస్ మాత్రమే కాదు.. లైక్స్ ను సైతం భారీగా కొల్లగొట్టి రికార్డుల మీద రికార్డుల్ని సొంతం చేసుకోవటం గమనార్హం.

# విడాకులు తీసుకున్నా.. మళ్లీ ప్రేమిస్తున్నా: హీరోయిన్

భర్త నుంచి విడాకులు తీసుకున్న తర్వాత తన జీవితం చాలా ప్రశాంతంగా ఉందని అంటోంది బాలీవుడ్ నటి. అంతేకాదు.. ఇప్పుడు మరొకరితో ప్రేమలో



ఉన్నానని చాలా హ్యాపీగా ఉన్నానని కూడా చెబుతోంది మినీషా లంబా. బచ్ నా యే హసీనా కిడ్నాప్ జోకర్ అనామికా వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న మినీషా.. తెనాలి రామ ఇంటర్నెట్ వాలా వంటి టీవీ షోస్ తోనూ మెప్పించింది.అయితే.. గతేడాది భర్త నుంచి ఆమె విడాకులు తీసుకుంది. 2015లో రియాన్ థామ్ అనే నైట్ క్లబ్ యజమానిని పెళ్లి చేసుకుంది. ఈ ఐదేళ్లలో వారి కాపురంలో విభేదాలు తలెత్తడంతో విడిపోవాలని నిర్ణయించారు. 2020లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం మరొకరితో లవ్ లో ఉన్నట్టు తెలిపిన మినీషా.. ఇప్పుడు జీవితం సంతోషంగా ఉందని తెలిపింది."ప్రతి మనిషికీ సంతోషంగా జీవించే హక్కు ఉంది. కానీ మన సమాజంలో విడాకులు తీసుకున్న మహిళను చిన్న చూపు చూస్తారు. అయితే.. ఆధునిక మహిళలు అందులోనూ స్వతంత్రంగా జీవించే శక్తిగలవారు తమ గళాన్ని వినిపిస్తున్నారు. గతంలో వివాహ బంధాన్ని నిలుపుకోవడానికి కేవలం స్త్రీలు మాత్రమే ప్రయత్నించేవారు. ఎన్నో కష్టాలు భరిస్తూ ఎన్నో త్యాగాలు చేసేవారు. కానీ.. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది" అని అన్నారు.ఇంకా చెబుతూ.. "నిలబడే అవకాశం లేదు అనుకున్న బంధనాల నుంచి విడిపోయేందుకు నేటి మహిళలు వెనుకాడటం లేదు. నిజానికి విభేదాలు తారస్థాయికి చేరిన తర్వాత ఆ బంధంలో కొనసాగడంలో అర్థం లేదు. విడాకులు తీసుకోవడమే మంచిది. భర్తతో విడిపోయినంత మాత్రాన జీవితం ముగిసిపోయినట్టు కాదు" అని చెప్పింది మినీషా లంబా.అంతేకాదు.. తాను మరొకరిని ప్రేమిస్తున్నట్టు కూడా తెలిపింది. ఓ మంచి మనిషితో ప్రేమలో ఉన్నానని తనకు మరోసారి ప్రేమ దొరికింది అని చెప్పింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190